క్లుప్తంగా

రాములోరి కల్యాణానికి బొండాలు



సీతారాముల చిత్రపటాలతో రూపొందించిన కల్యాణ కొబ్బరి బొండాలు

రామచంద్రపురం రూరల్: పట్టణంలోని శివాలయం ప్రాంగణంలో ఏటా జరిగే సీతారాముల కల్యాణానికి గత 13 ఏళ్లుగా ఆనవాయితీగా అందజేస్తున్న కల్యాణ బొండాల కోసం ద్రాక్షారామకు చెందిన హసన్‌బాద జెడ్పీ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ శ్రీను సీతారాముల చిత్రపటాలతో రూపొందించిన కల్యాణ కొబ్బరి బొండాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ద్రాక్షారామకే చెందిన జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్య, రూపాదేవి దంపతులు ఆనవాయితీగా అందిస్తుండగా ఈ ఏడాది సీతారాముల చిత్ర పటాలతో రూపొందించడం ఆనందంగా ఉందని ఆ దంపతులు డ్రాయింగ్ టీచర్ శ్రీనుకి కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

కాజులూరు: మండల గ్రామాల్లో ఏడో తేదీ సోమవారం నుంచి జరగనున్న ఆక్వా జోన్ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ సహాయాధికారి సుహాసిని అన్నారు. శనివారం గ్రామంలో ఆమె మాట్లాడుతూ ఏడో తేది సోమవారం నుంచి 11వ తేదీ శుక్రవారం వరకూ మండలంలోని కాజులూరు, పల్లిపాలెం, కోలంక, ఉప్పుమిల్లి, మంజేరు, నామవానిపాలెం, గొల్లపాలెం, అండ్రంగి, కుయ్యేరు, శీల, పెనుమళ్ళ, తనుమళ్ళ, ఆర్యావటం, అయితపూడి తదితర గ్రామాల్లో ఆక్వా జోన్ గ్రామ సభలు జరుగుతాయన్నారు. నాన్ ఆక్వాజోన్‌లో చెరువులు ఉన్న రైతులు ఈ సమావేశాల్లో పాల్గొని తమ చెరువులకు సంబంధించిన పత్రాలు సమర్పించి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో మత్స్య శాఖ సిబ్బంది సురేంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో మంచినీటికి కటకట



ద్రాక్షారామ బెస్తపేటలో మంచినీరు రాక ఎదురు చూస్తున్న మహిళ

రామచంద్రపురం రూరల్: మండలంలోనే మేజర్ పంచాయతీ ద్రాక్షారామలో మంచినీటికి ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. జల్‌జీవన్ మిషన్‌లో గ్రామంలో నూతన కనెక్షన్లు ఇచ్చిన తరువాత సమస్య తలెత్తిందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామం మొత్తానికి మంచి నీరు సక్రమంగా రావడం లేదని స్థానిక బెస్తపేటలో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉందని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చుక్కచుక్కలుగా నీరు వస్తుండటం ఒక్కో సమయంలో అసలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సాహితీ పురస్కార గ్రహీతకు సత్కారం



అవార్డు గ్రహీత స్వామి ప్రసాద్‌ను సత్కరిస్తున్న మిత్రులు

మండపేట: ఉగాదిని పురస్కరించుకుని ఇటీవల సాహితీ పురస్కారం అందుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు గండి స్వామిప్రసాద్‌ను శనివారం చిన్ననాటి మిత్రబృందం సత్కరించింది. మండలంలోని ద్వారపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్వామి ప్రసాద్ రాజమహేంద్రవరంలో ఇటీవల జిల్లా కలెక్టర్ ప్రశాంతి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోమువీర్రాజు చేతుల మీదుగా అవార్డు అందుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆయనను పట్టణంలోని జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ (రథంబడి) లో 1990–91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శాలువా పూలమాలతో సత్కరించారు. ప్రసాద్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వల్లూరి దొరకయ్య మాస్టారు, రథంబడి మిత్రులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన వేంకటేశ్వర ఆలయం

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. దీంతో మండలంలోని చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు.

రారండోయ్ వేడుక చూద్దాం

- సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం
- గ్రామాల్లో ఆలయాలు ముస్తాబు
- సత్యవాడలో 151 ఏళ్లుగా ఉత్సవాలు
- నేడు శ్రీరామనవమి

కపిలేశ్వరపురం: రాములోరి కల్యాణ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఆదివారం శ్రీరామనవమిని పురస్కరించుకుని గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించున్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఏటా స్వామివారి కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు ఆయా పట్టణాలతో పాటు 119 గ్రామాల్లోని రామాలయాలు ముస్తాబు చేశారు. ఆలయాల వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో చలువ పందిళ్లు వేశారు.

ఐక్యతకు ప్రతీక

ఉత్సవాల నిర్వహణ తరతరాలుగా గ్రామాల ప్రజల మధ్య ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. ప్రజలు కులాలకు అతీతంగా ఉత్సవ నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేసుకుని సమన్వయంతో కల్యాణోత్సవాలను నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. దాతల సహకారాలతో ఆలయాలకు రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవ చలువ పందిళ్లలో ఆధ్యాత్మిక గీతాలాపన, భజన, ఏకాహ ఆలాపన కళలను ప్రదర్శించేందుకు కళాకారులంతా సిద్ధంగా ఉన్నారు. బెల్లం పానకం, వడపప్పులను ప్రసాదంగా పంచేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

పానకం ప్రీతికరం

శ్రీరామునికి ఇష్టమైన బెల్లం పానకం, వడపప్పులను నైవేద్యంగా స్వామికి సమర్పిస్తారు. నైవేద్యమనే ఆధ్యాత్మిక అంశంతో పాటు వాటిలో మిళితమైన పదార్థాలు ఆయుర్వేద గుణాలుండటంతో ఆరోగ్యాన్నిస్తాయి. వేసవి ఆరంభ కాలంలో వచ్చే శ్రీరామ నవమి ఉత్సవంలో ప్రసాదంగా బెల్లం పానకం, వడపప్పులను భక్తులకు ప్రసాదంగా అందజేస్తారు. బెల్లం, మిరియాలు, యాలకులతో తయారు చేసిన పానకంలో ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి, పుష్కలంగా లభ్యమవుతాయి. సీజన్‌లో వచ్చే గొంతు సంబంధిత సమస్యలు తగ్గుతాయి. పెసరపప్పు శరీర వేడిని తగ్గించి చలువ చేస్తుంది.



అంగరలో వేంచేసిన సీతారాములు

రెండు నియోజకవర్గాల్లో ఉత్సవ సందడి

కె.గంగవరం మండలం సత్యవాడలో సీతారాముల కల్యాణం ఎంతో ప్రసిద్ధి. ఇక్కడ సుమారు 151 ఏళ్లుగా శ్రీరామ నవమి ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. సమీప గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున గ్రామంలోని కల్యాణాన్ని, ఆధ్యాత్మిక, వినోద కార్యక్రమాలను తిలకించేందుకు తరలివస్తారు. గ్రామంలో ఏ వీధి చూసినా ఉత్సవ నిర్వహణ సందడి కనిపిస్తుంది. పెద్దల నుంచి చిన్నారులు వరకూ చలువ పందిళ్ల అలంకరణలో భాగస్వాములయ్యారు. కాగితపు పూలను తయారు చేసి స్వామికి సమర్పించడంతో పాటు చలువ పందిళ్లలో అలంకరించడం ఆచారంగా వస్తోంది. ద్రాక్షారామలో భీమేశ్వరాలయ ప్రాంగణంలో కల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మండపేట పట్టణంలోని బురుగుంట చెరువు వద్ద సీతారామ క్షేత్రంలో స్వామి కల్యాణ వేడుకలను ఏటా ఘనంగా నిర్వహిస్తుంటారు. కొండపల్లి వారి రామాలయం, వల్లూరివారి వీధి, గొల్లల గుంట, రజక, మత్స్యకార వృత్తిదారుల ఏరియా, గొల్లపుంత తదితర ప్రాంతాల్లోని రామాలయాలు కల్యాణానికి సిద్ధమయ్యాయి. రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠంలో వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) ఆధ్వర్యంలో కల్యాణ ఉత్సవాన్ని వైభవంగా నిర్వస్తున్నారు. కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



అంగరలో సుందరంగా ముస్తాబైన పల్లపు వీధి రామాలయం



వెలంపాలెం వేదపాఠశాలలో రాములోరి కల్యాణానికి సిద్ధమైన చలువ పందిరి వేదిక

శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

కాజులూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు భక్తులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని రామాలయాల ఎదుట చలువ పందిళ్లు వేసి పచ్చని మామిడితోరణాలు, విద్యుత్ దీపాలంకరణలతో ఆలయాలను సుందరంగా అలంకరిస్తున్నారు. కల్యాణం అనంతరం అన్ని రామాలయాల వద్ద పానకం, చలివిడి, వడపప్పు పంపిణీ చేసి, ప్రసాదం వితరణ చేసేందుకు నిర్వాహక కమిటీ తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు అన్ని ఆలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

రాములోరి కల్యాణానికి వేదికలు సిద్ధం

రామచంద్రపురం రూరల్: నేడు శ్రీరామనవమి పురస్కరించుకుని రాములోరి కల్యాణానికి వేదికలు సిద్ధమయ్యాయి. ద్రాక్షారామ మార్కెట్, సూర్యా వీధి, తోటపేట, నరసాపురపుపేట, వెల్ల, వెలంపాలెం వేదపాఠశాల తదితర చోట్ల చలువ పందిళ్లు వేసి సిద్ధం చేశారు.

వెలంపాలెంలో భారీ ఏర్పాట్లు..

వెలంపాలెంలో చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి, చంద్రశేఖరేంద్ర భారతీస్వామి స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో 13 ఏళ్లుగా చేస్తున్న రాముల వారి కల్యాణం కోసం భారీ ఏర్పాట్లు చేశారు. బ్రహ్మశ్రీ మైలవరపు మృత్యుంజయశాస్త్రి బ్రహ్మత్వంలో బులుసు సోమనాథ శాస్త్రి, శేషమ్మ దంపతులు స్మారక సభా వేదికపై సీతారామ కల్యాణంతో పాటు శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు బులుసు సీతామహాలక్ష్మి, బులుసు సత్యప్రసాద్, పులవర్తి వెంకట రవిబాబు, బులుసు శేషవేణిలు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

ద్రాక్షారామ మార్కెట్‌లో..

గ్రామంలోని మార్కెట్‌లో వర్తక సంఘం ఆధ్వర్యంలో 1955 నుంచి సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మేడవరపు చింతామణి బ్రహ్మత్వంలో సమయమంతుల సతీష్, సౌమ్య దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

అన్యోన్య బంధానికి ప్రతీక



సీతారామచంద్రులు అన్యోన్య బంధానికి ప్రతీకగా నిలుస్తారు. స్వామివారి కల్యాణం జరుపుకునే శ్రీరామ నవమి ఉత్సవాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఆధునికత పేరుతో ఉత్సవ నిర్వహణను ఏమాత్రం తప్పుదోవ పట్టించవద్దు. స్వామికి అత్యంత ప్రీతికరమైన బెల్లం పానకాన్నే ప్రసాదంగా భక్తులకు అందజేయాలి. రస్నా, కూల్ డ్రింక్స్ తదితర ద్రవ పదార్థాలను అందజేయడం సరికాదు.

– కణ్వ మహర్షి, పామర్రు, కె.గంగవరం మండలం

మహిళలను ఆదర్శంగా తీసుకోవాలి

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ
- రిలే దీక్షలకు మద్దతు

మండపేట: పట్టణంలో జనావాసాల మధ్య వైన్ షాపు ఏర్పాటును వ్యతిరేకిస్తూ 16 రోజులుగా రిలే దీక్షలు చేసిన మహిళలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు) అన్నారు. 16వ రోజుకు చేరిన రిలే దీక్షల శిబిరాన్ని శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, రాజబాబు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు జొన్నపల్లి విజయలక్ష్మి, మొండి భవాని, నీలం దుర్గమ్మ, పిల్లి శ్రీనివాస్, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మీగడ శ్రీనివాస్ సందర్శించి సంఘీభావం తెలిపాశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ ఈ సమస్యపై 15 రోజులుగా పోరాడుతున్న 28, 29, 30 వార్డుల మహిళలను అభినందించారు. సప్తగిరి థియేటర్‌కు ఎదురుగా వైన్ షాపు ఏర్పాటు చేయడానికి వీల్లేదన్నారు. గత కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ సమస్యను తమ దృష్టికి తెచ్చారని, సభ్యులందరూ మద్యం షాపు ఏర్పాటును మూకుమ్మడిగా వ్యతిరేకించి తీర్మానం చేశామన్నారు. తీర్మాణం పత్రాన్ని కలెక్టరుకు అందించినట్టు తెలిపారు. పట్టణంలో కొంతమంది మహిళలు మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజబాబు మాట్లాడుతూ ఈ విషయంలో పార్టీలకు అతీతంగా నాయకులు సంపూర్ణ మద్దతు తెలపడం ఆనందదాయకమన్నారు. సమస్య వచ్చినప్పుడు కలిసికట్టుగా పనిచేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. సమస్యపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కూడా స్పందించి మహిళలకు అండగా నిలబడటమే కాకుండా జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ కమిషనర్, ఎక్సైజ్ డీసీ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేశారని వివరించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మద్దతిచ్చి కేశవరంలో జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడటం మంచి పరిణామం అన్నారు. కార్యక్రమంలో నాయకులు జొన్నపల్లి సత్తిబాబు, కొప్పిరెడ్డి పద్మావతి, సాధనాల శివభగవాన్, రెడ్డి రత్తయ్య, మొండి మురళి, మద్దూరి సిద్ధు, బాబి తదితరులు పాల్గొన్నారు.



మహిళల ఆందోళనకు మద్దతు తెలుపుతున్న చైర్‌పర్సన్, మున్సిపల్ కౌన్సిలర్లు

పేదల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

- ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి
- ఆయన సేవలను కొనియాడిన నేతలు

మండపేట: అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు) పేర్కొన్నారు. మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు బాబూజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ మందపల్లి రవి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, పట్టాభిరామయ్య, రాజబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో మెయిన్‌రోడ్డు వాణీమహల్ జంక్షన్ వద్ద నెలకొల్పిన మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ నాయకులు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లి శ్రీనివాస్, కొడమంచిలి భాస్కరరావు, మొండి మురళి, మందపల్లి సంజీవరావు, మందపల్లి సుధాకర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు దూలి జయరాజు, పెందుర్తి ప్రదీప్ కుమార్, చాపల వీరబాబు, మోరంపూడి సూరిబాబు, దుగ్గిరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రూరల్‌లో..

ఏడిదలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పలివెల సుధాకర్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేశవరంలో అంబేడ్కర్, జగజ్జీవన్ యూత్, ఎమ్మార్పీఎస్ యూత్ సభ్యులు నిర్వహించి వేడుకలకు గ్రామ సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి (సత్తిబాబు), వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూలి జయరాజులు హాజరయ్యారు. జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో పరమట తరుణ్, పైడిమళ్ల రాజు, జుత్తుక చిన్న, ఖండవిల్లి మోషే, పల్లేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో మహనీయుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కపిలేశ్వరపురం: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వడ్లమూరు, తాతపూడి, అచ్యుతాపురం, కాలేరు, వల్లూరు, లంక గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నేతలు పూలమాలలు నివాళులర్పించారు. దళిత సంఘాల నేతలు పిప్పర సంపతరావు, మల్లిపూడి శివకుమార్, తాతపూడి రాజేష్‌శర్మ, సిర్రా కొండబాబు, పెందుర్తి తేజ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ విశేష కృషి చేశారని కొనియాడారు. దేశంలో కుల వ్యవస్థను రూపుమాపేందుకు ధైర్య సాహసాలతో జగ్జీవన్‌రామ్ నడిపిన ఉద్యమాలు దోహదపడ్డాయన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవడమే ఆయనకు ఘనమైన నివాళి అన్నారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ సాకా శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ నెక్కంటి శ్రీరాంజీ, ఉద్యోగుల సంఘం నాయకుడు జిత్తుక మల్లికార్జునుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ పువ్వల చిట్టిబాబు, నాయకులు కట్టా మురళి, చింతా పెద్దకాపు, తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు



ఏడిదలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జగ్జీవన్‌రామ్ సేవలు అమూల్యం

రామచంద్రపురం: స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాజకీయవేత్తగా బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు అమూల్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో, మండలంలోని నరసాపురపు పేట, తాడిపల్లి గ్రామాలలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దళితుల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్‌రామ్ ఎనలేని కృషి చేశారని ఆయన ఆశయ సాధన కోసం అందరం కలిసి పనిచేద్దామని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు దళిత సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి



కాజులూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్ తదితరులు

కాజులూరు: కులాలు, వర్గాల మధ్య అసమానతలు తొలగి దేశ సమైక్యత, సామాజిక సమానత్వం కోసం డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు ఎనలేనివని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం మండలంలోని గొల్లపాలెం, కాజులూరు, కుయ్యేరు, ఉప్పుమిల్లి తదితర గ్రామాలలో స్థానిక నిర్వహించిన బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిలో మంత్రి సుభాష్ పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాజులూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ మొట్టమొదటి కార్మిక శాఖ మంత్రిగా పనిచేసిన జగ్జీవన్‌రామ్ 40 ఏళ్ల పాటు వివిధ శాఖల్లో పనిచేసి భారత ఉప ప్రధానిగా దేశాభివృద్ధికి పాటుపడ్డారన్నారు. ఆయన కృషి ఫలితంగానే దేశంలో బడుగుబలహీల వర్గాలకూ అభివృద్ధి ఫలాలు అందుతున్నాయన్నారు. దేశ పురోగతికి ఆయన చేసిన సేవలు వర్ణించలేనివన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాళ్ళ కృష్ణారావు, అన్యం శ్రీరామచంద్రమూర్తి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ యాళ్ల వెంకటరమణ, ఆర్ఐ వేగేశ్వరరావు, పలివెల ఇస్రాయిల్‌రాజు, కందవిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి సన్నిధిలో జిల్లా జడ్జి



ద్రాక్షారామలో వేదాశీర్వచనం అందుకుంటున్న జడ్జి సునీత

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని ఉమ్మడి తూర్పుగోదావరి ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గంధం సునీత శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. జడ్జి సునీత స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం బేడా మండపంలో ఆమెకు వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని జడ్జి సునీతకు స్వామివారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాంసం విక్రయాలు బంద్

మండపేట: శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం పట్టణంలో మాంసం విక్రయాలు బంద్ చేయాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ఆదేశించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీరామ నవమి సందర్భంగా మాంసం విక్రయాలు జరుపకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. దీని కోసం ముందుగా సంగంపుంత రోడ్డులోని కబేళాను మూసివేయించామని తెలిపారు. మాంసం వ్యాపారులు పండుగ రోజున ఎలాంటి అమ్మకాలు జరుపకూడదని హెచ్చరించారు. సర్దార్ వేగుళ్ల వీర్రాజు మున్సిపల్ మార్కెట్, రైతు బజార్, మారేడుబాక రోడ్డు, పెద్ద కాలువ వంతెన, గొల్లపుంత రోడ్డు, కపిలేశ్వరపురం రోడ్డు తదితర ప్రాంతాల్లో దుకాణదారులు మాంసం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.